క్లుప్తంగా

నేటి నుంచి క్రికెట్, వాలీబాల్ పోటీలు

కందుకూరు: రాచులూరులో శుక్రవారం నుంచి సీతారాంరెడ్డి స్మారక క్రికెట్ మరియు వాలీ బాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాంరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కందుకూరు, మహేశ్వరం మండలాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీలకు అర్హులన్నారు. అర్జున్ అవార్డు గ్రహీత రవికాంత్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందజేస్తారని తెలిపారు. మొదటి బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు, నాలుగో బహుమతిగా రూ.10 వేలుతో పాటు ట్రోఫీని అందజేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు సెల్ నంబర్లు 8688533284, 8096930700లలో సంప్రదించాలని కోరారు.

సబితారెడ్డికి అభినందనలు



సబితారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బడంగ్‌పేట్: మంత్రి సబితారెడ్డిని బీఆర్ఎస్ నేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి నేతృత్వంలో మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి చెందుతోందని కొనియాడారు. సబితారెడ్డిని కలిసిన వారిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు కృష్ణ, నాయకులు దర్శన్‌రెడ్డి, హనుమంతరావు తదితరులున్నారు.

రోడ్ల మరమ్మతుకు చర్యలు: లచ్చిరెడ్డి



ఏపీఆర్ క్రిస్టల్ ఎవెన్యూ కాలనీలో రోడ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్బీనగర్: వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఏపీఆర్ క్రిస్టల్ ఎవెన్యూ కాలనీలోని రోడ్లు వర్షాలకు గుంతలమయంగా మారిందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టి తీసుకెళ్లారు. దీంతో గురువారం కాలనీవాసులతో కలిసి కాలనీలో పర్యటించిన ఆయన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు వెంకట్‌రెడ్డి, సురేష్‌బాబు, విష్ణువర్ధన్‌రెడి పాల్గొన్నారు.

భక్తితోనే ముక్తి



అభిషేకం పీటను అందజేస్తున్న సర్పంచ్, భక్తులు

తలకొండపల్లి: మండలంలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి అభిషేకం పీటను సర్పంచ్ శ్రీశైలం విరాళంగా ఇచ్చారు. రూ. 9,116 తో తయారు చేయించిన పీటను ఆయన గురువారం ఆలయ అర్చకులకు అందజేశారు. కుటుంబసభ్యులతో కలిసి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ భక్తితోనే ముక్తి, మోక్షం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అర్చకులు పద్మాచార్యులు, జంగయ్య భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోండి



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జెడ్పీటీసీ

కడ్తాల్: కార్పొరేట్ ఆస్పత్రులు స్వచ్ఛందంగా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ కోరారు. గురువారం మండలంలోని గానుగుమార్లతండాలో హైదరాబాద్ కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న కామినేని ఆస్పత్రి యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం వైద్యులు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హంశ్యామోత్యానాయక్, వైద్యులు శ్రీవాణి, వంశీ, అనురాధ, దేవేందర్ గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

అంతర్గత మార్గం.. అధ్వానం

- కంకర, గుంతలు తేలిన రహదారులు
- మరమ్మతు చేపట్టని అధికారులు
- అవస్థల్లో వాహనదారులు, పాదచారులు



అంబేద్కర్‌నగర్‌లో రోడ్డుపై గుంతలు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. సర్కిల్ పరిధి అంబేద్కర్‌నగర్ కాలనీలోని రోడ్లు కంకర తేలి గుంతలమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. భారీ వర్షాలకు అంతర్గత రహదారులు, మెయిన్ రోడ్లు గుంతలు పడ్డాయి. అందుకే వర్షం వస్తుందంటే జనం భయపడుతున్నారు.

కనీస సౌకర్యాలు కరవు

సరూర్‌నగర్ డివిజన్‌లోని జేబీకాలనీ, భగత్‌సింగ్ నగర్, క్రాంతి నగర్, డాక్టర్స్ కాలనీల్లో కనీస సౌకర్యాలు లేక స్థానికులు అవస్థలు పడుతున్నారు. అస్తవ్యస్థమైన భూగర్భ డ్రైనేజీతో పాటు వరద నీటి కాలువలు లేక రోడ్డుపైనే వర్షం నీరు నిలుస్తోంది. చిన్నపాటి వర్షానికే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అధికారుల అలసత్వంతో సకాలంలో పనులు చేపట్టలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



రోడ్లు మరమ్మతులు చేపట్టకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. భూగర్భ డ్రైనేజీ, వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. అంతర్గత రోడ్లకు ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాలి. రాత్రి వేళల్లో బయటకు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు.

-బి.సురేశ్, సరూర్‌నగర్

అంబేడ్కర్ నగర్‌లో 'జోడో సమ్మేళన్'



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మధుయాష్కి తదితరులు

హుడాకాంప్లెక్స్: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర సంవత్సరం పూర్తయింది. అయితే గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ డివిజన్‌లో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో భారత్ జోడో సమ్మేళన్ పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రకు సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్, సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, పారిజాత నర్సింహారెడ్డి, మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి మధుయాష్కిగౌడ్ నివాళులు అర్పించారు.

అమ్మా బైలెల్లినాదో..



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: అమ్మ బైలెల్లినాదో.. తల్లీ బైలెల్లినాదో అంటూ అమ్మవారికి బోనాలు సమర్పించారు. గురువారం మండల కేంద్రంలో పోచమ్మ బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు అభిషేకం, అర్చన, కుంకుమార్చన, పుష్పాలంకరణ, మంత్ర పుష్పం వంటి పూజలు నిర్వహించారు. పోతరాజులు, శివసత్తుల విన్యాసాలు, ఘటాల ఊరేగింపు భక్తులను అలరించాయి. గంగపుత్రులు ప్రత్యేకంగా జాలపందిరితో అమ్మవారికి బోనం తయారు చేసి నృత్యాలు చేస్తూ సమర్పించారు. ప్రజలందరిని చల్లంగా చూడాలని అమ్మవారిని గ్రామస్తులు మొక్కుకున్నారు.

సబితారెడ్డి ప్రత్యేక పూజలు

పోచమ్మకు మంత్రి సబితారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరినీ సుఖ శాంతులతో చల్లంగా చూడాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మంత్రిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం సర్పంచ్ ప్రియాంక, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్వర్ణగంటి ఆనందం, ఎంపీటీసీ సుదర్శన్ యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మనోహర్‌రెడ్డికి సన్మానం

పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మనోహర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈశ్వర్ ముదిరాజ్, నాయకులు కుమార్, శ్రీకాంత్, నర్సింహ పలువురు పాల్గొన్నారు.

గట్టుఇప్పలపల్లిలో పుట్టడమే నేరమా?

జేఏసీ నాయకుడు రేణురెడ్డి



గట్టుఇప్పలపల్లిలో దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈ దీక్షలు గురువారానికి 67వ రోజుకు చేరుకున్నాయి. రోజులు గడుస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో జేఏసీ నాయకులు సందిగ్ధంలో పడ్డారు. గట్టుఇప్పలపల్లిలో పుట్టడమే నేరమా అని జేఏసీ నాయకుడు రేణురెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దీక్షలు, ధర్నాలు, ఆందోళనలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కార్యక్రమంలో దామోదర్, ఈదమయ్య, నాగయ్య, వెంకటయ్య, రాధాకృష్ణ, తేజ, పరశురాములు, బుచ్చయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

కస్తూరినగర్‌లో 'మేరీ మిట్టీ– మేరా దేశ్'



అమృత కలశంతో మట్టిని సేకరిస్తున్న సామ రంగారెడ్డి

హస్తినాపురం: బీజేపీ చేపట్టిన మేరా మిట్టీ– మేరా దేశ్ ప్రచారోద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా దేశరాజధాని ఢిల్లీలో పవిత్ర అమృత వాటిక నిర్మించేందుకు అవసరమైన మట్టిని సేకరించేందుకు ప్రధాని మోదీ పిలుపు మేరకు గడపగడపకూ బీజేపీ శ్రేణులు తిరుగుతున్నాయని ఆయన అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని కస్తూరినగర్ కాలనీలో అమృత కలశ్ యాత్రను రంగారెడ్డి చేపట్టారు. ఈ సందర్భంగా గడగడపకూ వెళ్లి అమృత కలశంతో మట్టిని సేకరించారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్, శాంతిమిత్ర, రాజవర్ధన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్,శశిధర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, జీవన్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మల్లేష్‌యాదవ్, రాఘవ, గోవర్ధన్ పాల్గొన్నారు.

వైభవంగా కాటమయ్య బోనాలు



గౌడ సంఘం ఆధ్వర్యంలో కాటమయ్య బోనాలు

కడ్తాల్: మండలంలోని చరికొండ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో కాటమయ్య, వన మైసమ్మ బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. గురువారం మహిళలు ఊరేగింపుగా వెళ్లి బోనాలు సమర్పించారు. పాడి పంటలతో చల్లంగా చూడాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా డప్పు దరువుల హోరు, యువకుల నృత్యాలు, పోతు రాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భారతమ్మ, ఎంపీటీసీ రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కట్ట మైసమ్మకు..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై ఉన్న కట్ట మైసమ్మ, మహంకాళి మాతలకు బోనాల ఉత్సవాలను గురువారం నిర్వహించారు. పలువురు మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవార్లను సమర్పించారు.

పోచమ్మ బోనాలు

తలకొండపల్లి: మండలంలోని దేవుని పడకల్‌లో ఘనంగా పోచమ్మ బోనాలు నిర్వహించారు. గ్రామాల్లో ప్రతీ ఇంటి నుంచి బోనాన్ని ఎత్తుకొని మహిళలు ఆలయానికి బయల్దేరారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు.

సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం

తుర్కయంజాల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని సీపీఎం మున్సిపల్ కార్యదర్శి కిషన్ పిలుపునిచ్చారు. అధిక ధరలు, నిరుద్యోగం, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కుదింపు, పేదలపై పన్నుల భారం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మికుల కనీస వేతనాలు తదితర డిమాండ్‌లతో పార్టీ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపుతో తుర్కయంజాల్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద కిషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కేంద్రం పూర్తిగా విఫలమయిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్యనారాయణ, భాస్కర్, ఆశీర్వాదం, యాదగిరి, శంకరయ్య పాల్గొన్నారు.

నేడు కడ్తాల్‌కు ఎమ్మెల్యే

కడ్తాల్: మండల కేంద్రంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కడ్తాల్‌కు వస్తున్నారని ఎంపీడీఓ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సీసీరోడ్ల ప్రారంభిస్తారని, ఆ తర్వాత 10:30 నిమిషాలకు మండల పరిషత్ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ, 11 గంటలకు స్త్రీ శక్తి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన, ఉప్పరాశి కుంట సుందరీకరణ పనులను ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం కడ్తాల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల్, ఆమనగల్లు మండలాలకు సంబంధించిన బీసీ కుల వృత్తుల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేస్తారని తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ



ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన సత్యనారాయణ గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించినవారిలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, నాయకులు పత్యానాయక్, వీరయ్య, వెంకటేశ్, రఘు, రమేశ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

'గోలి'ని అభినందించిన సబితారెడ్డి

ఆమనగల్లు: రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా నియమతులైన గోలి శ్రీనివాస్‌రెడ్డి గురువారం మంత్రి సబితారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డిని ఆమె అభినందించారు.

వాడవాడలా కృష్ణాష్టమి వేడుకలు



శివసాయినగర్ ఆలయంలో శ్రీకృష్ణుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కందుకూరు: మండలంలోని పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు జరిపారు. చిన్నారులు కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో అలరించగా, యువకులు పలు గ్రామాల్లో ఉట్లు కొట్టి పండుగను ఆస్వాదించారు.

టీటీడీ ఆధ్వర్యంలో..

మీర్‌పేట: తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మీర్‌పేట శివసాయినగర్‌లోని శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీవిష్ణు సహస్రనామ పరాయణం, కుంకుమార్చనతో పాటు గోపూజ చేశారు. కార్యక్రమంలో టీటీడీ ధర్మాచార్య రాజేశ్వరరావు, జనార్దన్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు సంతోష్‌రెడ్డి, వెంకట కృష్ణారావు, శ్రీగాయత్రి సేవా సంఘం ప్రతినిధులు శ్రీనివాస ప్రసాద్, లక్ష్మణరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో..

జిల్లెలగూడ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం సాయంత్రం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారని తెలిపారు.

ఘనంగా కృష్ణస్వామి జయంతి



కృష్ణస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కందుకూరు: హైదరాబాద్ తొలి మేయర్, ముదిరాజ్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 130 జయంతిని కందుకూరు మండల ముదిరాజ్ సంఘం యూత్ అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం కుందుకూరులోని ముదిరాజ్ భవన్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణస్వామి సేవలను కొనియాడారు. మేయర్‌గా, జర్నలిస్టుగా, ముదిరాజ్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా సమాజానికి ఎంతో సేవ చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు అంజయ్య ముదిరాజ్, యాదగిరి ముదిరాజ్, రాఘవేందర్ ముదిరాజ్, కృష్ణ ముదిరాజ్, శేఖర్ ముదిరాజ్, రాంచంద్రయ్య ముదిరాజ్, రమేశ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేసీఆర్



మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో ప్రచారం చేస్తున్న ఆచారి తదితరులు

బీజేపీ సీనియర్ నాయకుడు ఆచారి

కడ్తాల్: కేంద్రం ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను, గడప గడపకు వెళ్లి ప్రజలకు వివరించేందుకే మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ సీనియర్ నాయకుడు టి. ఆచారి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పల్లెపల్లెన బీజేపీ– ఇంటి ఇంటికి ఆచారి కార్యక్రమాన్ని గురువారం మండలంలోని రావిచేడ్, మద్దెలకుంట తండాలో నిర్వహించారు. ప్రధానమంత్రి బీమా యోజన, ఆయుష్మాన్ భారత్, సుకన్య సమృద్ధి యోజన తదితర సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కేంద్రం పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగి పోయారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్, నాయకులు రాములు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



బాధితుడిని పరామర్శిస్తున్న ఎంపీటీసీ

యాచారం: మంతన్‌గౌరెల్లి గ్రామంలో వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతినాయక్ డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమావత్‌ను గురువారం ఆమె పరామర్శించి రూ. 20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ వీధి కుక్కలతో ప్రజల ప్రాణాలకు ముప్పు ఉందని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ బాధితులకు ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అరవింద్, గ్రామస్తులు జంగయ్య, శ్రీను, చందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మోక్షం..!

- ఎమ్మెల్యే చొరవతో పనులు షురూ
- రూ.7.5 కోట్లతో నిర్మాణం ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



ఆగాపల్లి- మంచాల రోడ్డు

మంచాల: కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్న రోడ్డు నిర్మాణం పనులు ఎట్టకేలకు మోక్షం లభించింది. దీంతో రవాణా సమస్య పరిష్కారమైదని స్థానికులు చెబుతున్నారు. మండలంలోని ఆగాపల్లి నుంచి వయా జాపాల మీదుగా మంచాల రోడ్డు సమస్యల నిలయంగా మారింది. ఇది సింగిల్ రోడ్డు కావడంతో వాహనాల రద్దీ వలన తొందరగా పాడై పోతోంది. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గతంలో ఈ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2.75 కోట్లు మంజూరు చేసింది. కేటాయించిన నిధులతో నిర్మాణ పనులు పూర్తి కావని అధికారులు వెనుకడుగువేశారు.

ఎమ్మెల్యే చొరవ

ఈ రోడ్డు నిర్మాణం విషయంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేయడంతో తక్షణమే స్పందించారు. గతంలో రూ.2.75 కోట్లు ఉన్న నిధులు రోడ్డు నిర్మాణం కోసం సరిపోవని తెలపడంతో వెంటనే అదనంగా రూ.4కోట్ల 30లక్షలు మంజూరు చేశారు. దీంతో రూ.7 కోట్ల 5లక్షలతో ఆగాపల్లి నుండి మంచాల వరకు 18 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మించనున్నారు. పనులకు ఈ నెల 9వ తేదీన ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారు. అయితే ఇప్పటికే అధికారులు పనులను మొదలుపెట్టడం గమనార్హం. రోడ్డు పూర్తి అయితే ప్రయాణికులకు ఇబ్బందులు తొలగిపోతాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.